నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 4 జూన్ 2025 | BHADRADRI KOTHAGUDEM


- కేసీఆర్ ప్రభుత్వంలో పండుగలా సాగిన 'హరితహారం'
- మొక్కలు నాటడంపై ప్రజల్లో పెరిగిన అవగాహన
- అప్పుడు నాటిన మొక్కలు.. ఇప్పుడు పెద్దపెద్ద వృక్షాలు
- ప్రస్తుతం వనమహోత్సవాన్ని పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- నేటికీ సమీక్షలు జరపని జిల్లా అధికార యంత్రాంగం
- వర్షాలు కురుస్తున్నా మొక్కల పంపిణీ ఊసేలేదు..
- నర్సరీల్లోనే మగ్గుతున్న మొక్కలు.. పట్టించుకోని అధికారులు
- నాడు కోట్ల మొక్కలు.. నేడు లక్షల్లోనే లక్ష్యం

–ఖమ్మం, జూన్ 3



### ఆకుపచ్చ తెలంగాణే కేసీఆర్ లక్ష్యం..

ఆకుపచ్చ తెలంగాణను ఏర్పాటు చేసే లక్ష్యంతో ప్రారంభించిన హరితహారం కార్యక్రమం ఖమ్మం జిల్లావ్యాప్తంగా పదేండ్లు విజయవంతంగా కొనసాగింది. కోట్ల మొక్కలను నాటారు. అవి ఈరోజున వృక్షాలుగా పెరగడంతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం నెరవేరినట్టయింది. ఆ వనాల్లో నేడు ప్రజలు సేద తీరుతున్నారు. జిల్లాలోని అనేక ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పెరిగిన చెట్లు ప్రజలకు స్వచ్ఛమైన గాలిని ఇవ్వడంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. హరితహారం ద్వారా మొక్కలు నాటడంపై ప్రజల్లో అవగాహన బాగా పెరిగింది. ప్రజలే స్వచ్ఛందంగా నర్సరీల వద్దకు వచ్చి వారికి అవసరమైన మొక్కలను తీసుకెళ్లేవారు.



జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల ఖమ్మం కలెక్టరేట్‌లో జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులతో పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. అప్పటికే జిల్లాలో గత పది రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి రుతుపవనాలు జిల్లాను తాకాయి. వ్యవసాయ పనులు సైతం ప్రారంభమయ్యాయి.. కానీ.. ఆ సమీక్షలో 'వనమహోత్సవం' ఎజెండా లేకపోవడం గమనార్హం. రుతుపవనాలు జిల్లాను తాకినప్పటికీ మొక్కలు నాటే విషయంలో ప్రభుత్వ పెద్దలు, జిల్లా అధికారులకు పట్టింపు లేకపోవడం అత్యంత బాధాకరం. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వర్షాలు ప్రారంభమైన వెంటనే హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించి జిల్లావ్యాప్తంగా విరివిగా మొక్కలు నాటేవారు.. కానీ.. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు.

ఏదులాపురం మున్సిపాలిటీలోని నాయుడుపేట ఇందిరమ్మ కాలనీ క్రీడా ప్రాంగణంలో ఉన్న నర్సరీ

# వన మహోత్సవమేది?

## సర్కారు నిర్లక్ష్యం.. నెరవేరని లక్ష్యం

హరితహారం.. రాష్ట్రంలో ఈ పదం తెలియని వారు లేరు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ఏర్పడిన తొలి ప్రభుత్వం హరితహారాన్ని ప్రారంభించింది. అడవులు తగ్గి, చెట్లు లేక వాతావరణ సమతుల్యత ఏర్పడి సకాలంలో వానలు రాక ప్రజలు పడుతున్న ఇబ్బందులు చిన్నవి కావు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించవు. దీనిని దృష్టిలో ఉంచుకొని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ 2014-15 ఆర్థిక సంవత్సరంలో హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పదేండ్లపాటు దిగ్విజయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా ఎదిగి ఎంతోమందికి నీడనిస్తున్నాయి. అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఫారెస్టు భూముల్లో నాటిన మొక్కలు ఈరోజు పెద్దపెద్ద చెట్లుగా అవతరించాయి. అంతేకాకుండా ఖమ్మం జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, రహదారుల వెంట, చెరువు గట్లపైన, కాలువల పక్కన, ప్రభుత్వ భూములు, పార్కులు, కార్యాలయాల్లో కోట్ల సంఖ్యలో మొక్కలు నాటారు. ఈ రోజున అవి పెరిగి పెద్ద కావడంతో వాటిని నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు, సాధారణ ప్రజల్లో ఆనందానికి అవధులు లేవు. ప్రభుత్వ శాఖల అధికారులకు టార్గెట్లు ఇచ్చి మొక్కలను నాటించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హరితహారం పేరును వన మహోత్సవంగా మార్చారు.. కానీ.. రెండు సంవత్సరాలుగా జిల్లాలో పెద్దగా మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగట్లేదు. కేవలం వివిధ శాఖల అధికారులకు టార్గెట్లు మాత్రం ఇస్తున్నారు.. క్షేత్రస్థాయిలో మొక్కల పెంపకం, మొక్కల పంపిణీపై మాత్రం శ్రద్ధ లేదు.

### లక్ష్యం ఉన్నా.. ఆచరణ సున్నా..




ఈ ఏడాది ఖమ్మం జిల్లాలో 35 లక్షల 32 వేల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకున్నారు. వాటిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో 5,47,200, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 11,54,800, నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో 1,13,700, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 3,44,800, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో 2,29,900, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 81,200, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో 8,42,400, విద్యాశాఖ ఆధ్వర్యంలో 10 వేలు, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో 30 వేలు, మైన్స్ ఆధ్వర్యంలో 46 వేల మొక్కలు నాటేలా ప్రణాళికను రూపొందించారు. కానీ.. అటవీ, డీఆర్‌డీఏ, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో తప్ప మిగిలిన శాఖల ఆధ్వర్యంలో ఎక్కడా మొక్కలు పెంచుతున్న దాఖలాలు లేవు.



రఘునాథపాలెం పల్లె ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

### పల్లె ముంగిట్లో నర్సరీలు..

కేసీఆర్ తీసుకొచ్చిన నూతన పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీలో ఒక నర్సరీని ఏర్పాటు చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కలు తగ్గకుండా పంపిణీ చేయాలని చట్టం రూపొందించారు. వాణిజ్య మొక్కల కింద టేకు, సుబాబుల్, జామాయిల్ క్లోన్స్, పూలమొక్కల్లో టేకోమ, గన్నేరు, మందార, పండ్ల మొక్కల్లో ఉసిరి, దానిమ్మ, నిమ్మ, జామ, నీడనిచ్చే మొక్కల కింద వేప, గానుగ, రావి, మర్రి, సీమ తంగేడు, పెల్టోఫారం, గుల్మోహర్ తదితర మొక్కలను నాటారు. ప్రతిరోజు ప్రజలకు అవసరం వచ్చే మొక్కలతోపాటు పండ్లు, టేకు, ఉసిరి తదితర మొక్కలు కూడా పంచారు. పంచాయతీరాజ్ చట్టంలో పేర్కొన్నట్టు జిల్లాలోని 500 నర్సరీల్లో వివిధ రకాల మొక్కలను పెంచాలి.. కానీ.. నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలో వాటిని పట్టించుకున్న నాథుడే కరువయ్యారు.



కొత్తగూడెం సింగరేణిలో తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

### ప్రత్యేక రాష్ట్ర సాధనలో..

# కేసీఆర్ పాత్ర మరువలేనిది

- శాంతియుత పద్ధతిలో తెలంగాణ సాధించింది ఆయనే..
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

రామవరం, జూన్ 3: 'ఎవరు అవునన్నా.. కాదన్నా.. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర మరువలేనిది. రాష్ట్ర సాధన కోసం ఆయన ఎత్తుగడలు, వాక్చాతుర్యంతో హింసకు తావు లేకుండా శాంతియుత పద్ధతుల్లో రాష్ట్రాన్ని సాధించారని చెప్పడంలో అతిశయోక్తి లేదు' అని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్ ప్రగతి వనంలో సింగరేణి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర సాధన సమయంలో కేసీఆర్‌కు వెన్నంటి ఉండి నడిపించిన ప్రొఫెసర్ జయశంకర్, విద్యాసాగర్‌రావు, మేధావులు, కవులు, కళాకారులు, కార్మిక, కర్షక లోకం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు అందరూ కలిసి కొట్లాడటం వల్లనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. దేశవ్యాప్తంగా పబ్లిక్ సెక్టార్లలో సింగరేణి సంస్థ ఒకటి అని, దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద సంస్థ సింగరేణి అని అన్నారు. సింగరేణి కార్మికులు నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడైనా విపత్తు సంభవిస్తే తమవంతు సాయంగా విరాళం ఇచ్చి పెద్ద మనసు చాటుకున్నారని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర మరువలేనిదన్నారు. ఉద్యమంలో ఏమీ ఆశించకుండా మనస్సు, ధ్యాస, శ్వాస తెలంగాణ అని నమ్మి సకల జనుల సమ్మెలో 42 రోజులపాటు పాల్గొని తెలంగాణపై వారికున్న మక్కువను చాటారన్నారు. అనంతరం ఉత్తమ కార్మికుడిగా ఎన్నికైన గట్టయ్యను సింగరేణి యాజమాన్యంతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా జీఎం శాలెంరాజు, ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి, ఏరియా ఇంజినీర్ సూర్యనారాయణ రాజు, ఏజీఎం సివిల్ రామకృష్ణ, ఆర్‌సీహెచ్‌పీ ఎస్‌ఈ కరీముల్లా, క్వాలిటీ మేనేజర్ మదన్‌మోహన్, ఐఈడీ డీవీఐజీఎం యోహాన్, డీవైపీఎం శివకేశవరావు, మురళి, పలు సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

### దమ్మపేటలో సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీగా వచ్చి తహసీల్‌లో వినతి




తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు, కాలనీవాసులు

దమ్మపేట, జూన్ 3: తమ కాలనీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మల్లారం సమీపంలోని వైబీఆర్ కాలనీవాసులు మంగళవారం ఆందోళన చేపట్టారు. కాలనీలో నివాసం ఉంటున్న 120 కుటుంబాల ప్రజలు ర్యాలీగా వచ్చి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు, కాలనీవాసులు మాట్లాడుతూ తమ కాలనీలో ప్రతీ ఇంటికి పట్టాలు వచ్చే విధంగా చేస్తామని, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన హామీలు నీటిమూటలయ్యాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హామీ ఇచ్చినా సమస్యలు ఇంతవరకు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమ సమస్యలన్నీ పరిష్కారమయ్యే విధంగా చూడాలని, లేదంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు బత్తుల సాయి, యార్లగడ్డ మణికంఠ, బెజవాడ రాము, ఎస్‌కే జాన్‌బీ, నక్క నాగమణి, వీరస్వామి, వెంకన్న, రాము, బుల్లెమ్మ, కృష్ణవేణి, సోములు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

- విపత్తుల సమయంలో నష్టాల నివారణకు పటిష్ట చర్యలు
- 24 గంటలూ టోల్ ఫ్రీ - 1077
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, జూన్ 3: ఖమ్మం జిల్లాలో విపత్తుల సమయంలో జరిగే నష్టాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంతోపాటు జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుడు వరదల కారణంగా ప్రభావితమైన ప్రాంతాలను ఎంపీడీవోలు మండలాల వారీగా, మున్సిపల్ కమిషనర్లు నగరాలు, పట్టణాల వారీగా గుర్తించి నివేదిక అందించాలని ఆదేశించారు. జూన్ 15వ తేదీ నుంచి మహబూబాబాద్, వరంగల్ జిల్లాలో కురిసే వర్షం వివరాలను కూడా ట్రాక్ చేస్తూ నదీ ప్రవాహాల వివరాలను వాట్సాప్ గ్రూపుల ద్వారా జిల్లా అధికారులకు అందిస్తామని తెలిపారు. ప్రమాద హెచ్చరికలు ఎప్పటికప్పుడు గ్రామస్థాయికి చేరుకోవాలని, పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, ఆపదమిత్రలు, గ్రామ గ్రూపుల్లో సమాచారం ఉండాలన్నారు. వరదల పరిస్థితులను కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ జరుగుతుందన్నారు. అధికారులందరూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలపాటు 1077 టోల్ ఫ్రీ నెంబర్ కంట్రోల్ రూంలో ఉంటుందని, దీనికి వచ్చే ఫిర్యాదుల ప్రకారం అధికారులు స్పందించాలన్నారు. సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహకారం ఉంటుందన్నారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ మాట్లాడుతూ నగరంలో సమస్యాత్మక ప్రాంతాలను ఇప్పటికే గుర్తించామన్నారు. అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వల్నరబుల్ ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ గౌతమ్‌కుమార్, డీఆర్‌వో పద్మశ్రీ, జడ్పీ సీఈవో దీక్షారైనా, డీఆర్‌డీవో సన్యాసయ్య, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం ఏఎస్‌ఐ మద్దిలేటి, బృందం జగదీశ్, సురేష్‌కుమార్, రిజాజుద్దీన్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.




ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

# పకడ్బందీగా 'బడిబాట'

- సమష్టి కృషితోనే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతం
- బడిబాట కార్యక్రమంపై సమీక్షలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 3 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను అధికంగా నమోదు చేసేందుకు బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఐడీవోసీ కార్యాలయంలో లైన్ డిపార్ట్‌మెంట్స్ అధికారులతో సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసే పాఠ్య, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, డిజిటల్ విద్య, ఉపకార వేతనాలు, ఇతర ప్రోత్సాహకాల గురించి తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. 6 నుంచి 14 ఏళ్ల వయస్సు కలిగిన బడీడు పిల్లలందరినీ గుర్తించి సమీపంలోని పాఠశాలలకు వెళ్లే విధంగా ప్రోత్సహించాలని చెప్పారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించడానికి ఇష్టపడటం లేదో అందుకు గల కారణాలను కూడా అధికారులు నమోదు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా రానున్న రెండు వారాల్లో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను గుర్తించి.. వాటికి తగిన మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధిహామీ పథకం ద్వారా జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలలకు మట్టి ఇటుకలతో ప్రహరీల నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. రానున్న ఐదు రోజుల్లో ఏకరూప దుస్తుల తయారీ పూర్తి చేసి అన్ని పాఠశాలలకు అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ కో ఆర్డినేటర్లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, సీపీవో సంజీవరావు, మెప్మా పీడీ రాజేశ్, డీఈవో వెంకటేశ్వరాచారి, జిల్లా బీసీ సంక్షేమాధికారి ఇందిర, మహిళా, శిశు సంక్షేమాధికారి స్వర్ణలత లెనీనా, జిల్లా విద్యాశాఖ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.



లైన్ డిపార్ట్‌మెంట్స్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

# సంస్థ అభివృద్ధికి బంగారు బాటలు వేద్దాం..

### సింగరేణి జనరల్ మేనేజర్ల ప్రత్యక్ష సమీక్షలో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం




జనరల్ మేనేజర్ల సమీక్షలో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, జూన్ 3: కార్మికులు, అధికారులు అందరం కలిసి సింగరేణి సంస్థ అభివృద్ధికి బంగారు బాటలు వేద్దామని సంస్థ సీఎండీ బలరాం అన్నారు. సింగరేణి సంస్థలోని 12 ఏరియాల గనుల పరిస్థితి, భవిష్యత్‌లో గనుల సాధనకు అవలంబించాల్సిన కార్యాచరణపై దృష్టి సారించిన సీఎండీ.. కొత్తగూడెంలో ఏరియా జీఎంలతో తొలిసారిగా సుదీర్ఘంగా 10 గంటలపాటు మంగళవారం ప్రత్యక్ష సమీక్ష నిర్వహించారు. ఏరియా జీఎంలతో ఒక్కొక్కరితో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. కంపెనీ విస్తరణ, ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారంలో ఏరియా జీఎంలు పోషించాల్సిన పాత్ర గురించి కూలంకశంగా వివరించారు. సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణ రావు, ఎల్‌వీ సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఈడీ ఎస్ఏ డీఎం సుభాని, జీఎం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలందించాలి

### రేగళ్ల పీహెచ్‌సీ తనిఖీలో భద్రాద్రి కొత్తగూడెం డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్



రికార్డులు తనిఖీ చేసి మాట్లాడుతున్న భద్రాద్రి డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

లక్ష్మీదేవిపల్లి, జూన్ 3: వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని భద్రాద్రి డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ ఆదేశించారు. రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేసిన ఆయన.. సిబ్బంది హాజరు రిజిస్టర్, ఆరోగ్య మహిళా ప్రోగ్రాం రిజిస్టర్‌ను పరిశీలించారు. సిబ్బంది అందరూ సమయపాలన పాటిస్తున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని, రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. డాక్టర్ బి.హరీశ్, సీహెచ్‌వో సీతమ్మ, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

### సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట..

# నేడు నిరాహార దీక్ష

### టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

కొత్తగూడెం సింగరేణి, జూన్ 3: సింగరేణి ఆస్పత్రుల్లో కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేస్తూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సింగరేణి హెడ్డాఫీసు ఎదుట బుధవారం చేపట్టనున్న నిరాహార దీక్షను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తమ రక్తాన్ని చెమటగా మార్చి దేశానికి విద్యుత్ వెలుగులు అందిస్తున్న సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్యం అందించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెడ్డాఫీస్ ఎదుట తలపెట్టిన నిరాహార దీక్షలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### యూపీహెచ్‌సీ తనిఖీలో ఖమ్మం డీఎంహెచ్‌వో కళావతిబాయి



శ్రీనివాసనగర్ యూపీహెచ్‌సీ తనిఖీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

ఖమ్మం సిటీ/ ఖమ్మం, జూన్ 3: వర్షాకాలంలో వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి సూచించారు. ఖమ్మం శ్రీనివాసనగర్ యూపీహెచ్‌సీని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానకు వచ్చిన రోగులతో మాట్లాడారు. స్థానిక వైద్యాధికారి, ఫార్మసీ ఆఫీసర్, నర్సింగ్ ఆఫీసర్ల డ్యూటీ చార్ట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే జూన్ నుంచి నవంబర్ వరకు దోమల సంక్రమణ కాలం అని, మలేరియా, డెంగీ, ఫైలేరియా, మెదడువాపు, చికెన్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్త పడాలని, అర్బన్ మలేరియా యంత్రాంగంతో సమన్వయంగా వ్యవహరించి లార్వా నిర్మూలన ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. జ్వర పీడితులను గుర్తించి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ పీ రామారావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రేష్ట, బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**డాక్టర్స్ డైరీ ఆవిష్కరణ**

తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ డైరీని ఖమ్మం ఐఎంఏ హాలులో డీఎంహెచ్‌వో డాక్టర్ బీ కళావతిబాయి, సంఘం రాష్ట్ర సెంట్రల్ కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ కత్తి జనార్దన్ ఆవిష్కరించారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వరికూటి సుబ్బారావు, ఖమ్మం జిల్లా యూనిట్ ప్రెసిడెంట్ డాక్టర్ రచ్చ శ్రవణ్‌కుమార్, డాక్టర్ రమేష్, డాక్టర్ ఐ రత్నమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# 'పది' సప్లిమెంటరీ పరీక్షలు షురూ..

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, జూన్ 3: జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొత్తం ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తుండగా.. తెలుగు పరీక్షకు 405 మంది విద్యార్థులకు.. 355 మంది హాజరైనట్లు డీఈవో వెంకటేశ్వరాచారి తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఐదు కేంద్రాలను తనిఖీ చేయగా.. మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు. కొత్తగూడెం ఎంఈవో డాక్టర్ ప్రభుదయాళ్ తన బృందంతో కలిసి మణుగూరు, భద్రాచలంలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

భద్రాచలం పరీక్ష కేంద్రం వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సభ్యులు

